

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 14 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 87 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఇది నాకు లభించిన ఆత్మీయ బహుమతి : మోదీ



న్యూఢిల్లీ : ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో జరిగిన ఓ అపురూప సంఘటనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా శనివారం గుర్తు చేసుకున్నారు. తనకు పద్మశ్రీ పురస్కార గ్రహీత బిరేన్ కుమార్ బసక్ ఇచ్చిన ప్రత్యేక బహుమతి అత్యంత విలువైనదని, ఇది తనకు గొప్ప సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. పద్మ పురస్కారాల ప్రదానోత్సవం నవంబరు 8న రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన చేనేతకారుడు బిరేన్ కుమార్ బసక్‌కు పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బిరేన్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంభాషించారు. బిరేన్ ఓ చీరను మోదీకి బహూకరించారు. ప్రజలతో మోదీ మాట్లాడుతున్నట్లుగా ఈ చీరపై ముద్రించారు. ఈ బహుమతిని మోదీ శనివారం ఓ ట్వీట్‌లో గుర్తు చేసుకున్నారు. "శ్రీ బిరేన్ కుమార్ బసక్ పశ్చిమ బెంగాల్‌లోని నాడియాకు చెందినవారు. ఆయన సుప్రసిద్ధ చేనేతకారుడు. తాను నేసిన చీరల్లో భారత దేశ చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన వివిధ అంశాలను చూపుతారు. పద్మ పురస్కార గ్రహీతలతో నేను మాట్లాడినపుడు, ఆయన నాకు ఒకటి ఇచ్చారు, అది నన్నెంతో అబ్బురపరిచింది" అని మోదీ ట్వీట్ చేశారు. బిరేన్‌తో మోదీ సంభాషిసున్నట్లు కనిపిస్తున్న ఓ ఫొటోను షేర్ చేశారు. ప్రజలతో మోదీ మాట్లాడుతున్నట్లుగా ఓ డిజైన్‌తో కూడిన చీరను మోదీకి బిరేన్ బహూకరించారు. ఆయన 1970వ దశకంలో కేవలం ఒక రూపాయితో వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుతం సంవత్సరానికి రూ.25 కోట్లు టర్నోవర్‌తో ఆయన వ్యాపారం సాగుతో ంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ, క్రికెటర్ సౌరవ్ గంగూలీ, గాయనీమణులు లతా మంగేష్కర్, ఆశా భోంస్లే వంటివారు ఆయన వద్ద వస్త్రాలు కొంటున్నారు.ఈ ఏడాది 119 మందికి పద్మ పురస్కారాలు లభించాయి. వీరిలో 102 మందికి పద్మశ్రీ, 10 మందికి పద్మ భూషణ్, ఏడుగురికి పద్మ విభూషణ్ పురస్కారాలు లభించాయి.

## ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది : కిషన్ రెడ్డి



తెలంగాణలో ఏ రైతు బాయిల్డ్ రైస్ పండించరని?ధాన్యం మాత్రమే పండిస్తారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.బాయిల్డ్ రైస్ సమస్య రైతులది కాదని..మిల్లర్లదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై విష ప్రచారం చేస్తోందన్నారు. తప్పు చేసింది ఎవరు? నిందలు ఎవరిమీద వేస్తున్నారని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నేతలు ఎందుకు ధర్నాలు చేస్తున్నారు..ఎవరిపై చేస్తున్నారని నిలదీశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అగ్రిమెంట్ ఉందని వెల్లడించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తారని ఒప్పుకున్నారని..తర్వాత 90 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచమని మరో లేఖ రాశారని తెలిపారు. మరోసారి 108 లక్షల మెట్రిక్ టన్నులు పండుతుందని చెప్పారు. 2014లో ధాన్యం సేకరణ కోసం రూ.3,404 కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.26 వేల కోట్లతో కేంద్రం ధాన్యం కొంటోందని చెప్పారు.ధాన్యం సేకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. ధాన్యం సేకరణకు డబ్బులు పూర్తిగా కేంద్రం ఇస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కేసీఆర్ కోసం కాదు..రైతుల కోసం ధాన్యం కొంటున్నట్లు వెల్లడించారు.బాయిల్డ్ రైస్ ను చాలా రాష్ట్రాల్లో తినడం లేదని పేర్కొన్నారు. పంజాబ్ లో కూడా బాయిల్డ్ రైస్ కొనడం లేదని వెల్లడించారు. బాయిల్డ్ రైస్ తీసుకోబోమని మూడేళ్లుగా చెప్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎక్కడ అన్యాయం చేసిందో చెప్పాలన్నారు.

## కులతత్వానికి యోగి ముగింపు పలికారు: అమిత్ షా



లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లో కులతత్వం, వారసత్వం, బుజ్జగింపులకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముగింపు పలికారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శనివారం అజాంగఢ్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. యోగి ఏలుబడిలో యూపీ ఎంతగానో అభివృద్ధి సాధించిందని, 2015కు ముందు ఆర్థిక సూచీలో దేశంలో 6వ స్థానంలో ఉన్న యూపీ, నేడు రెండవ స్థానానికి చేరిందని చెప్పుకొచ్చారు. అలాగే నిరుద్యోగాన్ని కట్టడీ చేశారని, రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు, సీట్లు కూడా చాలా వరకు పెంచారని అమిత్ షా అన్నారు.ఇక ప్రతిపక్ష నేత అఖిలేష్ యాదవ్‌పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అజాంగఢ్ రౌడీ రాజ్యంగా ఉండేదని, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యాక విద్యా కేంద్రంగా అవతరించిందని అన్నారు. బీజేపీకి సమాజ్‌వాదీ పార్టీకి ఉన్న తేడాను జామ్ అనే పదం ద్వారా అమిత్ షా వివరించే ప్రయత్నం చేశారు. తమ ఉద్దేశంలో జామ్ అంటే 'జే-జన్‌ధన్ అకౌంట్, ఏ-ఆధార్ కార్డ్, ఎమ్-మొబైల్ ఫోన్' అని అదే అఖిలేష్ అర్థంలో జామ్ అంటే 'జే-జిన్నా, ఏ-అజాం ఖాన్, ఎమ్-ముఖ్తార్' అని అమిత్ షా విమర్శలు గుప్పించారు.

## మార్పు కోసమే ఈ పోరాటం : పవన్



అమరావతి : నెల్లూరు నగర పాలక సంస్థతోపాటు 12 మున్సిపాలిటీలకు ఈ నెల 15వ తేదీన ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. జనసేన పార్టీ తరపున అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. మరికొన్ని పురపాలక, నగర పాలక సంస్థల్లోనూ, ప్రజా పరిషత్తుల్లో వచ్చిన ఉప ఎన్నికల్లో జనసేన పోటీలో నిలిచిందన్నారు. ఒక మార్పు కోసమే ఈ పోరాటమన్నారు. జన సైనికులు పదవుల కోసం కాకుండా సేవచేయడానికే ముందుంటారని విజ్ఞులైన మీకు తెలిసిన విషయమేనన్నారు. అన్ని వేళలా ప్రజల కోసం పని చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడేవారినే ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి అవకాశం కల్పించామని పవన్ తెలిపారు. స్థానిక సమస్యలపై అవగాహనతో పాటు సామాజిక స్పృహతో పని చేసేవారిని స్థానిక సంస్థల ప్రతినిధులుగా ఎన్నుకొంటే ప్రజా గళం ప్రతిధ్వనిస్తుందన్నారు. జనసేన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పవన్ విజ్ఞప్తి చేశారు.

## లోకేష్ రౌడీలాగా మాట్లాడుతున్నారు: ఎమ్మెల్యే రోజా

చిత్తూరు: నారా లోకేష్ రౌడీలాగా మాట్లాడుతున్నారని నగరి ఎమ్మెల్యే రోజా విమర్శించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. చంద్రబాబు ఏనాడూ కుప్పం అభివృద్ధిని పట్టించుకోలేదని.. కోవిడ్ సమయంలోను ప్రజలను గాలికొదిలేశారని మండిపడ్డారు.కనీసం తాగునీరు సదుపాయం కూడా అందించలేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు.. ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని రోజా ఎద్దేవా చేశారు. కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని రోజా పేర్కొన్నారు.




## లోకేష్ భాష అసభ్యంగా, తలవంపులు తెచ్చేలా ఉంది: ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖపట్నం: కుప్పంతో సహా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉప ఎన్నికలు వైసీపీ గెలుస్తుందని...ఎటువంటి సందేహం లేదని ఎంపీ విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఫలితాల తర్వాత టీడీపీ తుడిచిపెట్టుకొని పోతుందన్నారు. లోకేష్ భాష అసభ్యంగా, తలవంపులు తెచ్చే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. టీడీపీకి భవిష్యత్ నాయకుడుగా ప్రాజెక్ట్ అవుతున్న వ్యక్తి తాను మాట్లాడే భాష తగునా అని ప్రశ్నించారు. జీవీఎంసీలో రెండు వార్డుల్లో వైసీపీ ఘన విజయం ఖాయమన్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు 2024 నాటి ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉంటాయో అనటానికి నిదర్శనంగా తీసుకుంటామని ఎంపీ విజయసాయి తెలిపారు.

## ఏపీలో కొత్తగా 156 కరోనా కేసులు



అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై వైద్యాధికారులు ప్రకటన విడుదల చేశారు. ఏపీలో కొత్తగా 156 కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా కరోనాతో ఒకరు మృతి చెందారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 20,69,770 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మొత్తం 14,412 మరణాలు సంభవించాయి. కరోనా నుంచి 20,52,230 మంది రికవరీ చెందారు.

## ప్రధాని మోదీతో అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందం భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. సెనేటర్ జాన్ కార్నిన్ నేతృత్వంలోని అమెరికా కాంగ్రెస్ బృందం మోదీని శుక్రవారం కలిసింది. ఇరు దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించింది. పెద్ద, విభిన్న జనాభా సవాళ్లు ఉన్నప్పటికీ కోవిడ్ పరిస్థితిని భారత్ అద్భుతంగా అదుపుచేసిందని యూఎస్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రశంసించింది.మరోవైపు భారత్-అమెరికా మధ్య భాగస్వామ్య, ప్రజాస్వామ్య విలువలతో ముడిపడిన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో యూఎస్ కాంగ్రెస్ స్థిరమైన మద్దతు, నిర్మాణాత్మక పాత్రను ప్రధాని మోదీ కొనియాడారు. రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధాలు మరింతగా బలోపేతమవుతాయని ఆయన ఆకాంక్షించారు.



## త్వరలో టీడీపీ కనుమరుగు: అంబటి రాంబాబు

ప్రకాశం జిల్లా: రాష్ట్రంలో టీడీపీ కొనఊపిరితో ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. శనివారం ఆయన దర్శిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ త్వరలో టీడీపీ కనుమరుగైపోతుందన్నారు. చంద్రబాబు హయాంలో ముద్రగడ పద్మనాభం ఉద్యమం చేస్తుంటే... ఉద్యమం చేయకుండా హింసించారని అంబటి రాంబాబు గుర్తు చేశారు.



## ధాన్యం కొనుగోలు చేయాలని షర్మిల దీక్ష



హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ ఆర్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దీక్షని ప్రారంభించారు. రైతులకు అండగా ఉండేందుకు షర్మిల ఈ దీక్ష చేస్తున్నట్లు స్పష్టం చేశారు. వరికోనుగోలు విషయంలో బీజేపీ, కెసిఆర్ ఒకరిపై ఒకరు నెపం వేస్తూ అన్నదాతలకు సున్నం పెడుతున్నారు. వడ్ల కుప్పలమీదే రైతులు చనిపోతున్నా కెసిఆర్ లో చలనం లేదు. వడ్లు కొనడంలో కెసిఆర్ కు ఉన్న ఇబ్బందేంటి. కేంద్రానికి ఏజెంట్ గా ఎందుకు మారారో సమాధానం చెప్పాలని అన్నారు. కేంద్రం విధించే ఆంక్షలపై ఎందుకు సంతకాలు పెట్టారు. ఆంక్షలు పెట్టినరోజే ఢిల్లీలోనే కదా ధర్నాలు చేయాల్సింది, ప్రెస్ మీట్లు పెట్టాలి కానీ అది చేతకాక ఇక్కడ ధర్నాలు చేస్తారా. మీరు చేసే ధర్నాల వాళ్ళ ఎవరికి ఉపయోగమని అన్నారు. వడ్లు కొనడం చేతకాక ధర్నాలు చేస్తున్నారు కెసిఆర్. 20 శాతం బోనస్ ఇచ్చిమరీ వడ్లు కొన్న ఘనత వైఎస్సార్ కే దక్కుతుంది. పక్క రాష్ట్రాలు ఎమ్మెస్పీ పై బోనస్ ఇచ్చి ధాన్యం సేకరిస్తుంటే కెసిఆర్ మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. పక్క రాష్ట్రాల ప్రభుత్వాలకు రైతులపై ఉన్న చిత్తశుద్ధి కెసిఆర్ కు ఎందుకు లేదు. భారం మొత్తం రైతులపై మోపి తప్పించుకునే ప్రయత్నం చేయడం సమంజసం కాదు. రైస్ ఎక్కడ అమ్మాలి, వాటిని ఏం చేసుకుంటారనేది ప్రభుత్వాలు చూసుకోవాల్సింది. రైతు పండించిన పంట కొనడం ముమ్మాటికీ ప్రభుత్వ విధి. మీ కాళ్లుపట్టుకొని బతిమలాడే స్థితికి తీసుకొచ్చేనందుకేనా బీజేపీ, టీఆరెస్ లను అధికారంలోకి తెచ్చింది. మిల్లర్లకు మేలు చేయాలనే కెసిఆర్ ప్రయత్నాలుని ఆరోపించారు. రైతు నష్టపోవాలని, మిల్లర్లు లాభపడాలనే కెసిఆర్ వడ్లు కొనడం లేదు. కెసిఆర్ కు నిజాయితీ ఉంటె సివిల్ సప్లై అడిట్ రిపోర్ట్ బయటపెట్టాలి. నియంత్రిత వ్యవసాయం మీద వున్న శ్రద్ధ మద్యం, డ్రగ్స్ పై నియంత్రణ పెడితే రాష్ట్రం బాగుపడుతుంది. డ్రగ్స్ సంస్కృతి జిల్లాలకు పాకింది, ఆ పాపం కెసిఆర్ దే. ప్రజల గొంతు నొక్కేయాలని ధర్నా చౌక్ మూసేయాలని చుసిన కెసిఆర్ కు మళ్ళీ అదే వేదిక దిక్కు అయ్యిందని అన్నారు.మీకు పాలనా చేతకాక ధర్నాలు చేస్తున్నారు. 36 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టిన మోసగాడు కెసిఆర్. పంటబీమా, ఇన్పుట్ సబ్సిడీ లేదు. రైతు బంధు పేరిట నాలుగు వేలు ఇస్తూ 24 వేలు ఎగ్గొట్టారు. వడ్లు ఎవరో కొంటె మీ బోడి పెత్తనం ఏంది. కేంద్రం పెత్తనం ఏంటి ఆఖరి గింజ కొంటామని కెసిఆర్ మాట ఇచ్చారు. ఆఖరి గింజ వరకు కెసిఆర్ కొనాల్సిందే. మెడలు వంచుతామని చెప్పిన కెసిఆర్ ఇప్పుడెందుకు వంచలేకపోతున్నారు. వాళ్ళ మెడలేమైనా లావు అయ్యాయా లేక మీ చేతులు సన్నగా అయ్యాయా. వరి వేయవద్దని చెప్పేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారా. లేక కమిషన్ల కోసం కట్టారా. ఉచిత ఎరువుల హామీ ఇంకెప్పుడు అమలు చేస్తావని నిలదీసారు.

# సంపాదకీయం

ఆదివారం 14 నవంబరు 2021

## చైనాలో మళ్లీ నియంతృత్వం

ఏ దేశమైనా ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరగాలి. ఆ దేశ ప్రజలు తమ నేతను ఎన్నుకోవాలి. పాలన చూసి ప్రజలు నాయకుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ చైనా అధినేత జిన్ పింగ్ మాత్రం తానే పూర్తి కాలం అధినేతగా ప్రకటించుకుంటున్నారు. రాజ్యాంగ సవరణ తెచ్చి మరీ చైనా అధినేతగా తాను జీవిత కాలం కొనసాగేలా జిన్ పింగ్ చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి. అంటే దాదాపు 2035 వరకూ జిన్ పింగ్ చైనా అధినేతగా వ్యవహరిస్తారన్న మాట.దేశాన్ని ప్రగతి బాటలో పయనింప చేసేందుకు తానే దేశానికి నాయకత్వం వహించాలని జిన్ పింగ్ భావిస్తున్నారు. సెంట్రల్ కమిటీలో మరోసారి జిన్ పింగ్ ను చైనా కమ్యునిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, దేశాధ్యక్షుడిగా మూడోసారి ఎన్నిక కానున్నారు. వచ్చే ఏడాదితో జిన్ పింగ్ పదవీ కాలం పూర్తవుతున్న నేపథ్యంలో సెంట్రల్ కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో జిన్ పింగ్ ను మరోసారి ఎన్నిక కానున్నారు.చైనా అధ్యక్షుడిగా జిన్ పింగ్ కు తిరుగులేని అధికారాలున్నాయి. ప్రపంచంలో చైనాను అగ్రదేశంగా నిలిపేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. 1982లో అప్పటి అధ్యక్షుడు డెంగ్ జియావో పింగ్ రాజ్యాంగ సవరణ చేశారు. ఈ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండు సార్లకు మించి అధ్యక్షుడిగా ఉండటానికి వీలులేదు. అందుకు కారణాలు కూడా ఆయన చెప్పారు. ఇది నియంతృత్వానికి దారి తీస్తుందని ఆయన ఆనాడే చెప్పారు.కానీ నాటి నేతల మాటలను జిన్ పింగ్ పక్కన పెట్టారు. జిన్ పింగ్ చేసిన రాజ్యాంగ సవరణ ప్రకారం 2035 వరకూ ఆయనే చైనా అధ్యక్షుడిగా కొనసాగే వీలుంది. అంటే జిన్ పింగ్ 82 ఏళ్ల వరకూ చైనా అధిపతిగా కొనసాగుతారన్న మాట. చైనాలో 19వ సెంట్రల్ కమిటీ ఆరో ప్లీనరీ చైనా రాజధాని బీజింగ్‌లో ప్రారంభమైంది. ఇప్పటికే రెండు సార్లు అధ్యక్షుడిగా జిన్ పింగ్ అధికారం చేపట్టారు. ఇదిలా ఉంటే మూడో సారే కాకుండా శాశ్వతంగా అధ్యక్షుడిగా జిన్ పింగే ఉండేలా పావులు కదుపుతున్నారు. వచ్చే ఏడాది జిన్ పింగ్ పదవీకాలం ముగియనుంది. 2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రమంగా ప్రాబల్యాన్ని పెంచుకొన్నారు జిన్ పింగ్. పార్టీలో, దేశంలోని కీలక అధికార పదవుల్లో తన వర్గీయులను నియమించుకోవడం ద్వారా స్వీయాధికారానికి ఎదురులేకుండా చేసుకున్నారు. అంతకుముందు అధికారంలో ఉన్న హు జింటావో పార్టీలో ప్రజాస్వామిక ధోరణులు, సమష్టి నాయకత్వంపై దృష్టి కేంద్రీకరించగా అందుకు భిన్నంగా ఏకస్వామ్యం, ఏక వ్యక్తి పాలనవైపు జిన్‌పింగ్ మొగ్గుచూపడం గమనార్హం. ప్రస్తుతం బీజింగ్‌లో జరుగుతున్న పార్టీ ప్లీనరీలో కేంద్ర కమిటీకి చెందిన 370 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలుస్తోంది. ఆధునిక చైనా చరిత్రలో ఇదో కీలకఘట్టమని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే అసలు బీజింగ్ సమావేశం అజెండా బయటకు రాలేదు. సమావేశం తరవాత తీర్మానంలోని పలు అంశాలపై ఒక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. ప్లీనరీ తీర్మానాలను వచ్చే ఏడాది జరిగే చైనా కమ్యూనిస్టు పార్టీ సమావేశం ఎలాంటి చర్చలూ లేకుండా ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సమావేశం అజెండాపై ఉత్కంఠ నెలకొంది. ఇక ఇరుగుపొరుగు దేశాలతో చైనా అనుసరిస్తున్న విధానం ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ప్రత్యేకించి భారత్‌తో డోక్లాం, లద్దాఖ్ సరిహద్దుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదుదక్షిణ చైనా సముద్రంతో పాటు తైవాన్‌పై అనుసరిస్తున్న దుందుడుకు విధానాలతో భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు నెలకొనే అవకాశముంది. చైనాలో తిరుగులేని నేతగా ఆవిర్భవించిన జిన్‌పింగ్ ఇదే వైఖరిని పొరుగుదేశాలతో పాటు అంతర్జాతీయ యవనికపై ప్రదర్శిస్తే ఎన్నో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి

## దూరం పెరుగుతున్న పోలవరం



ఏలూరు, నవంబర్ 13, (న్యూస్ పల్స్)పోలవరం జాతీయ ప్రాజెక్ట్. కచ్చితంగా కట్టాల్సిన బాధ్యత కేంద్ర పెద్దలకు ఉంది. అలాగే విభజన హామీలను తుచ తప్పకుండా అమలు చేయాలి. అసలు పార్లమెంట్ అత్యున్నత వేదిక. అక్కడ చట్టాలు చేసేవారు తామే వాటిని గౌరవించకపోతే ఎంతటి నగుబాటో కాషాయం పార్టీ పెద్దలకు ఇప్పటికీ అర్థం కావడంలేదు. ఏదైనా తమకు అనుకూలంగా చేసుకోవడమే బీజేపీ నేతలకు అలవాటు అయిన వేళ ఏపీకి నోటి మాటగా గత ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీని ప్రత్యేక హోదాను తొక్కిపడేయడంలో ఆశ్చర్యం కూడా ఏమీలేదు.పోలవరం ప్రాజెక్ట్ విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ సోము వీర్రాజు పెద్ద గొంతుక వేసుకుని మరీ తాపీగా ఇపుడు నిజాలు చెబుతున్నారు. అవును మరి ఆయన ఇపుడే నిద్ర లేచినట్లుగా మాట్లాడుతున్నారు. ఏపీలో ఆరున్నరేళుగా రెండు ప్రభుత్వాలు పాలిస్తున్నాయి. కేంద్రంలో అయితే ఒకే ప్రభుత్వం ఉంది. పైగా చంద్రబాబుని పదేళ్ల తరువాత మద్దతు ఇచ్చి మరీ ముద్దుగా సీఎం కుర్చీలో కూర్చోబెట్టిన మోడీ అక్కడ ప్రధాని. ఆయనే స్వయంగా ఏపీకి వచ్చి పోలవరాన్ని ఏటీఎం గా బాబు వాడుకుంటున్నారు అని ఘాటుగానే ఆరోపించారు. మరి అంతటి ప్రధాని కూడా ఎందుకు తన చేతిలోని సీబీఐని అదేశించి విచారణ జరిపించలేకపోయారన్నదే ఇక్కడ ప్రశ్న.పోలవరానికి నిధులు తగ్గించేసిన విషయంలో బీజేపీ కచ్చితంగా డిఫెన్స్ లో పడింది. ఇది వాస్తవం. ఏపీలో జనాల మనోభావాలతో ముడిపడిన ఈ ప్రాజెక్ట్ అడుగు ముందుకు కదలకపోయినా బీజేపీనే ఏపీ జనాలు ఆడిపోసుకుంటారు. ఎందుకంటే ఇది జాతీయ ప్రాజెక్ట్ కాబట్టి. జగన్ చంద్రబాబు పేరు చెప్పి జనాలను రెచ్చగొట్టినా వారు అసలు శాంతించరు అని కూడా బీజేపీ పెద్దలకు తెలుసు. అయినా సరే ఇక చేసేది లేక అవినీతి ఆయుధాన్ని నమ్ముకున్నారు. దానికి కారణం కూడా ఉంది. గతంలో జగన్ చంద్రబాబుని ఇవే ఆరోపణలు చేశారు కాబట్టి. తాము ఆ అవినీతి చేస్తే జనాలకు కనెక్ట్ అవుతుంది, జగన్ కూడా ఇరుకున పడుతారు అని సోము వీర్రాజు తెలివిగా పొలిటికల్ గేమ్ స్టార్ట్ చేశారు. కానీ అది బూమరాంగ్ అవుతోంది మరి.నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి ఆరోపణల మీద విచారణ జరిపించాలి. ఎవరు పోలవరానికి ఇచ్చిన నిధులను దోచుకున్నారో జనాల ముందే పెట్టి నిరూపించాలి. అదే సమయంలో ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని కట్టి చూపించాలి. అంతే తప్ప అవినీతి జరిగింది కాబట్టి ఇంతే నిధులు ఇస్తామనడం మాత్రం క్షంతవ్యం కానే కాదు. మరి ఏపీ రాజకీయాల మీద బీజేపీకి నిజంగా ఆసక్తి ఉంటే ఆడాల్సింది తొండి ఆట కాదు, డైరెక్ట్ గా జనం మనసు గెలుచుకునే ఆట. అదే పోలవరం నిర్మాణం చేయడం. సోము వీర్రాజు కూడా బాబుని, జగన్ని తిట్టి ఉపయోగం లేదు, కేంద్రంతో చెప్పి పోలవరాన్ని పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటేనే ఏపీలో బీజేపీ బతికి బట్టకట్టేది, అదే సమయంలో ఆ పార్టీకి రాజకీయ పరపతి కూడా పెరిగేది.

## అనంతపురంలో నీటికి కటకటే

అనంతపురం, నవంబర్ 13, (న్యూస్ పల్స్)వేసవికి ముందే తీవ్ర రూపం దాల్చుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఆవాసాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలకు తాగునీరు అందకపోవడంతో వీరు ఆందోళనలు కూడా చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 34.40 శాతం వర్షపాతం లోటు రాష్ట్రంలో నెలకొంది. నీటి వనరులు అడుగంటడంతో సమస్య తీవ్రమవుతోంది. 1,091 ఆవాసాలకు తాగునీరు అందకపోవడంతో గ్రామిణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టింది. అది అరకొరగానే సాగుతోంది. తాగునీటి సమస్యను గుర్తించిన ఎనిమిది జిల్లాల్లో 1,774 ట్యాంకర్లతో రోజుకు 6,550 ట్రిప్పులు వేయాల్సి ఉండగా, 4,800 నుంచి 5,200 లోపు ట్రిప్పులు మాత్రమే వేస్తున్నారు. 26.17 ఎంఎల్‌డిల(రోజుకు 2కోట్ల 61 లక్షల 70 వేల లీటర్లు) తాగునీటిని అందించాల్సి ఉండగా ప్రస్తుతం అందిస్తున్నది మాత్రం 18 నుంచి 22 ఎంఎల్‌డిలు (180 నుండి 210 లక్షల లీటర్లు) మాత్రమే. గ్రామాల్లో బిందెనక బింది వరుస కట్టి, ట్యాంకర్ల రాక కోసం ప్రజలు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పలు వేదికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేశామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తూనే ఉంది. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో నీరు లేకపోవడంతో పాఠశాలల్లో మరుగుదొడ్ల వినియోగంపై నిషేధం విధించినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో ఒవర్ హెడ్ ట్యాంకులు, బోర్లు ఉన్నా మరమ్మతుల కారణంగా నీరందించలేని పరిస్థితి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోని పలు బోర్లు భూగర్భజలాలు అడుగంటడంతో నీరు అందడం లేదు. రానున్న నాలుగు నెలల్లో ఈ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గ్రామాల్లో రోజు రోజుకు మరుగున పడిపోతున్నాయి. పైపులైన్లు మరమ్మతులకు గురికావడం, లేదా పథకమే శిథిలావస్థకు



చేరిపోవడం తదితర కారణాల వలన ఈ ట్యాంకులు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. దీనిపై గ్రామదర్శిని వంటి కార్యక్రమాల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించకపోవడంతో ఆయా గ్రామస్తులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తాళ్లపాలెం సంత వద్ద సుజల స్రవంతి ద్వారా అనకాపల్లి మండలం సంపత్‌పురం నుండి వస్తున్న మంచినీరు గత పది రోజులుగా నిలచిపోయింది. దీంతో తాగునీటిక కోసం ామస్తులు తీవ్ర ఎదుర్కొంటున్నారు. సంపత్‌పురం నుండి ఐదు మండలాల్లో 110 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే పది రోజులుగా తాళ్లపాలెం సంత నుండి భీమవరం, కన్నూరుపాలెం గ్రామాలకు ఈ సుజల స్రవంతి నుంచి నీరు సరఫరా రావడం లేదు. దీనిపై అధికారులు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరుతున్నప్పటికీ వారంతా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పది రోజుల నుండి సుమారు 10 గ్రామాలకు సరఫరా నిలచిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నీటిని అందించేందుకు కృషి చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు

## ఎక్కడ చూసినా చెత్తా, చెదరామే

కర్నూలు, నవంబర్ 13, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా చిప్పర్తి మండలంలోని 12 పంచాయతీల్లో 16 గ్రామాల్లో ఏ వీధిలో చూసినా మురుగునీరు, చెత్తచెదారం పేరుకొపోయి పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. పంచాయతీ పాలక వర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు కేవలం గ్రామదర్శిని, పల్లెపిలుపు, పల్లెనిద్ర తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకే సరిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచుల పదవి కాలం ముగిశాక గ్రామాల్లో పారిశుధ్యం పడేకేసింది. గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినా ఫలితం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రత్యేకాధికారులు కేవలం గ్రామదర్శిని తదితర ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి వెళ్లిపోతున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గ్రామాల్లో రోడ్ల వెంట మురికినీరు నిలువ ఉండి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నగరడోణ, నేమకల్లు, ఏరూరు గ్రామాల వీధుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వీటిని దూరంగా తరలించాలని ఆదేశాలున్నా అమలు చేసే వారు కరువయ్యారు. పందుల యజమా నులకు అధికారులు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.పది రోజులుగా గ్రామాల్లోని కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లి కంపు కొడుతోందని ప్రజలు పేర్కొంటు న్నారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు లేక రోడ్లపైనే మురికినీరు ప్రవహించి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో కార్మికులున్నా వారికి సరిపడ్డ వేతనం ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. దీంతో పారిశుధ్య పనులు చేసేవారులేక దుర్గంధంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ ప్రత్యేకాధికారులు, సిబ్బంది స్పందించి గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య పనులపై దృష్టి కేంద్రీకరించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

## గుర్రుగా ఉన్న కాళింగులు

శ్రీకాకుళం, నవంబర్ 13, (న్యూస్ పల్స్)కాళింగులకు ఒక కార్పొరేషన్ జగన్ సర్కార్ ఏర్పాటు చేసింది. దాంతో శ్రీకాకుళం జిల్లా మొత్తం మీద ఉన్న 18 లక్షల ఓట్లు గుత్తమొత్తంగా వైసీపీకి పడతాయనుకుంటే పొరపాటే. ఈ కార్పొరేషన్ కి ఒక చైర్మన్, 12 మంది డైరెక్టర్లతో నియామకాలు అయితే జరిపారు కానీ దానితో పాటే అసంతృప్తి కూడా వెల్లువలా పాకుతూ వచ్చింది. ఎంత చిత్రమంటే చైర్మన్ కి తెలియకుండా డైరెక్టర్ల నియామకం జరిగింది. అసలు ఎవరు డైరెక్టర్లు అన్నది శ్రీకాకుళం జిల్లాలో పెద్ద తలకాయలుగా ఉంటున్న వైసీపీకి చెందిన కాళింగ నేతలకే తెలియకపోవడం అసలైన విడ్డూరం తాజాగా శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సమావేశం అయిన కాళింగ కులస్థులంతా ఈ కార్పొరేషన్ మాకొద్దు అని తీర్మానించేశారు. కష్టపడిన వారికి ప్రాతినిధ్యం లేదు. అన్నింటికీ మించి ముక్కూ మొహం తెలియని వారిని తెచ్చి డైరెక్టర్లుగా చేయడమేంటి అని కూడా గుస్సా అయ్యారు. అంతే కాదు వైసీపీ గెలుపు కోసం ఆరుగాలం శ్రమించిన వారికి పదవులు దక్కలేదు అని కూడా మండిపోయారుట. మొత్తానిక్ ఇలా నియామకాలు జరిగాయో లేదో అలా రాజీనామాలు అంటున్నారుట.ఉత్తరాంధ్రలో కాళింగ కులస్థులు అత్యధికం, మొత్తం మూడు జిల్లాలలో దాదాపు ముప్పయి లక్షల దాకా వీరు ఉంటారని ఒక అంచనా. అటువంటి అతి ముఖ్యమైన సామాజికవర్గంలో పదవులు భర్తీ చేసినపుడు జిల్లాలోని కాళింగ పెద్దల నుంచి సలహాలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. స్పీకర్ తమ్మినేని సీతారాం. శ్రీకాకుళం జిల్లా వైసీపీ ప్రెసిడెంట్ కిల్లి కృపారాణి, జిల్లాకు చెందిన వైసీపీ కళింగ నేతలు దువ్వాడ శ్రీనివాస్, పేడాడ తిలక్ వంటి వారితో కనీసం సంప్రదింపులు లేవట. పైగా కాళింగేతర మంత్రుల సూచనల మేరకే కమిటీలో డైరెక్టర్లను వేశారట. ఇంకా చిత్రమేంటంటే టీడీపీకి చెందిన వారికి పదవులు దక్కడం. దాంతో అమీతుమీ తేల్చుకోవడానికి వైసీపీకి చెందిన కాళింగ పెద్దలు రెడీ అవుతున్నారు.శ్రీకాకుళంలో మూడు ప్రధాన కులాల మధ్య రాజకీయంగా ఆధిపత్య పోరు సాగుతోంది. రాజకీయంగా అతి పెద్ద వాటాను వెలమలు ఎప్పటికప్పుడు కొట్టేస్తున్నారు. ఆ తరువాత వరసలో తూర్పు కాపులు కూడా ఉన్నారు. మరి కాళింగ కులస్థులు జిల్లాలో అత్యధిక జనాభా ఉండి కూడా ఎందుకు ముందుకు రావడంలేదు అంటే వారి మధ్య ఉన్న అనైక్యత కారణంగా చెబుతున్నారు.వారిని అణగదొక్కే విషయంలో మిగిలిన సామాజిక వర్గాలు కూడా ఒక్కటిగా ఉంటున్నాయి. దాంతో జగన్ సీఎం అయినా కూడా కాళింగులకు మంత్రి పదవి దక్కలేదని ఆవేదన చెందుతున్నారు. ఆఖరుకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే అందులో కూడా ఇతర కులాలు వేలూ కాలూ పెట్టి తమకు అన్యాయం చేస్తారా అని కాళింగులు గగ్గోలు పెడుతున్నారు.

## మంగళగిరి ముందు చూపు

గుంటూరు, నవంబర్ 13, (న్యూస్ పల్స్)జగన్ ఏ పనిచేసినా ముందు చూపుతోనే చేస్తారు. మంగళగిరిలో ఆళ్ల రామకృష్ణారెడ్డి మరింత బలం కావడానికి మూడేళ్ల ముందే నిర్ణయం తీసుకున్నారు. ఆ నియోజకవర్గానికి చెందిన మూరుగుడు హన్మంతరావును ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. నిజానికి ఈ పేరు ఎవరూ ఊహించలేదు. గుంటూరు జిల్లా నుంచి మర్రి రాజశేఖర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు వస్తుందని అనుకున్నారు. ఉమ్మారెడ్డికి వచ్చింది. కానీ మర్రికి ఇవ్వకుండా అనూహ్యంగా మూరుగుడు హన్మంతరావుకు ఇచ్చారు.మూరుగుడు హన్మంతరావు పద్మశాలి సామాజికవర్గానికి చెందిన నేత. మంగళగిరి నియోజకవర్గం నుంచి రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999, 2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2009 లో ఆయన బంధువు కాండ్రు కమలకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చినా ఆమె గెలిచారు. 2014లో వీరు టీడీపీ వైపు వెళ్లినా 2019 ఎన్నికల సమాయానికి వీరంతా వైసీపీలో చేరిపోయారు. మంగళగిరిలో లోకేష్ పరాజయానికి పనిచేశారు.మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలి సామాజికవర్గం ఎక్కువ. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డిని రెండుసార్లు నుంచి గెలిపిస్తుంది వారే. దీంతో ఆ సామాజికవర్గాన్ని సంతృప్తి పర్చేందుకు జగన్ ఈసారి మూరుగుడు హన్మంతరావుకు పదవి ఇచ్చారంటున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మంగళగిరి నుంచి నారా లోకేష్ పోటీ చేస్తారంటున్నారు. లోకేష్ ను మరోసారి ఓడించాలంటే అక్కడ పద్మశాలి సామాజికవర్గాన్ని మంచి చేసుకోవాలి.కేవలం మంగళగిరిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మూరుగుడు హన్మంతరావుకు జగన్ పదవి ఇచ్చారంటున్నారు. మూడు రాజధానుల ప్రకటనతో ఈ ప్రాంతంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో అది బయటపడింది. దీంతో మురుగుకు పదవి ఇచ్చి నష్ట నివారణ చర్యలను జగన్ చేపట్టారంటున్నారు. ఆళ్లకు అండగా మరోసారి పద్మశాలి నియోజకవర్గం నిలవాలన్నదే ఈ ఎంపిక ముఖ్యోద్దేశ్యం.

## పవన్.. ఒక్కసారి ఛాన్స్

గుంటూరు, నవంబర్ 13, (న్యూస్ పల్స్)ఏపీలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని జనసేన తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంది. జగన్, చంద్రబాబులని రీప్లేస్ చేయాలని పవన్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు. కానీ ఎక్కడా కూడా పవన్ ప్రయత్నాలు సక్సెస్ కాలేదు. ఎలాగో 2019 ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసి చేతులు కాల్చుకున్నారు. కేవలం ఒక సీటు మాత్రం గెలుచుకోగలిగారు. ఇక గెలిచిన ఆయన కూడా వైసీపీలోకి వెళ్ళిపోయారు. దీంతో ఏపీలో జనసేన పరిస్తితి ఘోరంగా తయారైంది.కానీ పార్టీకి బలపడటానికి చాలా అవకాశాలు వచ్చాయి. పవన్ మాత్రం ఆ అవకాశాలని ఉపయోగించుకోలేదు. రెండున్నర ఏళ్లుగా పార్టీ బలోపేతం అయ్యే కార్యక్రమాలు పెద్దగా చేయలేదు. ఒక వైపు అధికార వైసీపీపై వ్యతిరేకత పెరుగుతుంది?ఆ వ్యతిరేకతని క్యాష్ చేసుకోవడంలో టీడీపీ విఫలమవుతుంది. ఇలాంటి పరిస్తితుల్లో వన్ రాజకీయంగా ఎదగడానికి మంచి ఛాన్స్. కానీ అది కూడా యూజ్ చేసుకోలేదు. దాని వల్ల ఏపీలో జనసేన పరిస్తితి దారుణంగానే ఉంది.ఒకవేళ పవన్ బలపడుతున్నారు అనుకుంటే?ఇతర పార్టీలోనే నాయకులు జనసేనలో చేరడానికి చూస్తారు. కానీ ఈ రెండున్నర ఏళ్లలో అలాంటి కార్యక్రమాలు ఏమి జరగలేదు. ఒక్క బలమైన నాయకుడు జనసేనలో చేరలేదు. ఈ మధ్య పవన్ దూకుడుగా రాజకీయాలు చేయడం మొదలుపెట్టిన సరే?వేరే పార్టీ నాయకులు జనసేనలో చేరడానికి రావడం లేదు. కానీ ఇక్కడే పవన్‌కు అతి పెద్ద టర్నింగ్ పాయింట్ వచ్చింది. అది కూడా టీడీపీ రూపంలో. నెక్స్ట్ ఎన్నికల్లో పవన్, టీడీపీతో పొత్తు పెట్టుకుంటారని ప్రచారం నడుస్తున్న విషయం తెలిసిందే.ఇదే జనసేనకు బాగా ప్లస్ అయింది..జనసేనకు ఒంటరిగా గెలిచే సత్తా ఇంకా రాలేదు. ఇలాంటి సమయంలో టీడీపీతో కలిస్తే కొన్ని సీట్లు గెలుచుకోవచ్చు. అందుకే కొందరు నాయకులు జనసేనలో చేరి సీటు దక్కించుకుంటే గెలిచే అవకాశాలు వస్తాయని భావిస్తున్నారట. ఒకవేళ పొత్తు ఉంటే ఏ సీట్లు అయితే దక్కే ఛాన్స్ ఉందని అనుకుంటున్నారో?ఆయా నియోజకవర్గాల్లోని కొందరు నాయకులు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారట. అంటే టీడీపీ రూపంలో పవన్‌కు పెద్ద టర్నింగ్ పాయింట్ వచ్చిందనే చెప్పాలి.

## మళ్లీ కూటమి కడతారా

ఏలూరు, నవంబర్ 13, (న్యూస్ పల్స్)ఏపీలో జగన్‌కు చెక్ పెట్టడానికి చంద్రబాబు-పవన్ కళ్యాణ్ ఏకమవుతున్నారని రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్న విషయం తెలిసిందే. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబుకు?.జగన్‌ని ఢీకొట్టే సత్తా రావడం లేదు. అలా అని పవన్‌కు అసలు ఆ సత్తా లేదు. కాకపోతే బాబు-పవన్ కలిస్తే మాత్రం కాస్త రాజకీయం మారుతుంది?జగన్‌కు చెక్ పెట్టే అవకాశాలు పెరుగుతాయి. అందుకే టీడీపీ-జనసేనలు పొత్తు దిశగా ముందుకెళుతున్నాయని ప్రచారం నడుస్తోంది.అయితే వీరి పొత్తులో బీజేపీ కలిసే అవకాశాలు లేవని అర్ధమవుతుంది. బీజేపీని దగ్గర చేసుకోవాలని బాబు బాగానే ప్రయత్నిస్తున్నారు?కానీ ఆ పార్టీ దగ్గర కావడం లేదు. దీంతో బీజేపీ-జనసేన పొత్తు కూడా పెటాకులు అయ్యేలా ఉంది. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల ఏదో కేంద్రం అండ ఉంటుంది తప్ప?రాజకీయంగా పవన్ బలపడే పరిస్తితి లేదు. ఆ విషయం ఇప్పటికే అర్ధమైంది. బీజేపీతో ముందుకెళితే ఎన్నికల్లో రాణించడం కష్టమని పవన్‌కు అర్ధమవుతుంది. అదే టీడీపీతో కలిస్తే ఓ 10 సీట్లు అయిన గెలుచుకోవచ్చు. అందుకే పవన్..బాబుతో కలిసి ముందుకెళ్లాలని చూస్తున్నారు. బీజేపీ మాత్రం కలిసి రావడం లేదు. దీంతో బీజేపీని పవన్వదిలేయడానికి సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ఇక టీడీపీ-జనసేనలని కలిపేందుకు బీజేపీ సీనియర్ కామినేని శ్రీనివాస్ కూడా గట్టిగానే ట్రై చేస్తున్నారట.కమ్మ వర్గానికి చెందిన కామినేనికి చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అటు పవన్‌తో కూడా మంచి సంబంధాలు ఉన్నాయి. గతంలో కామినేని టీడీపీలో పనిచేశారు?ప్రజారాజ్యంలో కూడా పనిచేశారు. ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. గతంలో పొత్తుతో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. కానీ తర్వాత పొత్తు విడిపోయాక కామినేని ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే ఈయన జనసేనలోకి వెళ్ళే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని ప్రచారం నడుస్తోంది. ఒకవేళ బీజేఎ?టీడీపీకి దూరంగా ఉంటే?ఈయన జనసేనలో చేరి?టీడీపీతో పొత్తు సెట్ చేసేలా ఉన్నారు. మొత్తానికైతే బాబు-పవన్‌ల కలవడం గ్యారెంటీ అని తెలుస్తోంది.

# నిమ్మ ముంచేసింది



విజయవాడ, నవంబర్ 13, (న్యూస్ పల్స్)ఒకప్పుడు కాసుల వర్షం కురిపించిన నిమ్మ ఇప్పుడు రైతుకు కన్నీళ్లు తెప్పిస్తోంది. మూడేళ్లుగా నిమ్మ రైతులు నష్టాలతో విలవిలలాడుతున్నారు. ఒకప్పుడు ఎకరానికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం పొందిన నిమ్మ రైతుకు నేడు సాగుఖర్చులు కూడా రాని పరిస్థితి.. కోత ఖర్చులు కూడా రావడం లేదని నిమ్మ రైతు వాపోతున్నాడు. కరోనా దెబ్బతో మూడేళ్లుగా నిమ్మ రైతుకు మార్కెట్‌లో సరైన ధర లభించడం లేదు. కిలో నిమ్మ ధర రూ. 4 నుంచి రూ. 5 ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సగటున కిలో రూ. 25 నుంచి రూ. 30 ఉంటేనే రైతుకు లాభం. ఈ నేపథ్యంలో నిమ్మ పంటను కొనసాగించాలా.. తొలగించాలా అన్నది తేల్చుకోలేని సందిగ్ధంలో రైతులున్నారు. నిమ్మపై విసుగెత్తిన రైతు పామాయిల్ వైపు మొగ్గుతున్నాడు. నిమ్మ సేద్యానికి ఎకరానికి ఎరువులు, తీత, పాదులు చేయడం, ఎరువుల ఖర్చు, నీటి తడులు, కూలీల ఖర్చు వంటివి కలిపి ఎకరానికి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. నాటురకం నిమ్మ, బాలాజీ నిమ్మ, పెట్లూరి నిమ్మలు సేద్యంలో ఉన్నాయి. ఎకరానికి రూ.40 వేల నుంచి రూ. 50 వేలకు కౌలు చెల్లించాలి. ఈ పరిస్థితుల్లో నిమ్మకు ధరలేక కౌలు చెల్లించలేక మధ్యలోనే వదిలేస్తున్నారు. ఏటా 1.93 లక్షల టన్నుల పంట పశ్చిమ గోదావరి జిల్లాలో 9 వేల హెక్టార్లలో నిమ్మ పంట సాగుచేస్తున్నారు. ఏటా 1.93 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తవుతోంది. ఈ పంటంతా జిల్లాలోని ఏలూరు, గోపన్నపాలెం, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, యాదవోలులోని నిమ్మ మార్కెట్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతవుతోంది. నిమ్మకు ధరలేకపోతే చెట్టుకు కాయను అలాగే వదిలేసే పరిస్థితిలేదు. కాయ కోయకపోయినా రైతు నష్టపోతాడు. దీంతో విధిగా కాయను బయటకు చేర్చాల్సి వస్తోంది. నిమ్మపండును కోయకుండా వదిలేస్తే చెట్ల కిందే రాలి నిమ్మ అక్కడే కుళ్లిపోతుంది. అందులోని సిట్రిక్ యాసిడ్ ప్రభావంతో చెట్టు చనిపోతుంది. దాంతో చెట్టును కాపాడుకోవడానికి నిమ్మకాను కూలీలతో ఏరించి బయట పారబోయాల్సి వస్తోంది. నిమ్మ కిలో రూ. 7 నుంచి రూ. 10 ఉంటే కనీసం కాయ కోసిన ఖర్చు, ఎగుమతి, దిగుమతి ఖర్చు, రవాణా ఖర్చులు వస్తాయి. నిమ్మకు ఏటా రెండు నుంచి మూడు నెలలే డిమాండ్ ఉంటుంది. కరోనా దెబ్బకు ఆ డిమాండ్ కూడా పడిపోయింది. మూడు సంవత్సరాలుగా నిమ్మ సాగు చేస్తున్న రైతులందరూ ధర లేక నష్టపోతున్నాం. సేద్యం ఖర్చులు కూడా రావడం లేదు. ఏడాదిలో ఎక్కువ కాలం కిలో నిమ్మ రూ.10 లోపే ఉంటోంది. రెండు రోజుల క్రితం నిమ్మ కిలో రూ.4 నుంచి రూ. 5 ధర పలికింది. 50 కిలోల బస్తా కోతకు, రవాణాకు, ఎగుమతి, దిగుమతులకు రూ.350 ఖర్చు అవుతోంది. ఎక్కువసార్లు ఆ ధర కూడా రావడం లేదు. నిమ్మకు మార్కెట్ ధర సరిగా లేకపోవడంతో ఏటా నష్టపోతున్నాం. ఎకరానికి రూ. 50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. పెట్టుబడి, కోత ఖర్చులు కూడా తిరిగి రావడం లేదు. నిమ్మను చెట్ల కింద వదిలేస్తే చెట్లు చనిపోతాయని కూలీలతో ఏరించి బయట పారబోయాల్సి వస్తోంది.

# ఈఏపీసెట్ కౌన్సిలింగ్ విడతల వారిగా వెంటనే నిర్వహించాలి


విశాఖపట్నం ఎపెసెట్ కౌన్సిలింగ్ నిర్వహణలో జరగుతున్న జాప్యం విద్యార్థుల భవిష్యత్ పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి విద్యా సంవత్సరం రక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ వ్యవహరిస్తున్న తీరు, ఇంజనీరింగ్ విద్య కోసం ఎదురు చూపులు చూస్తున్న విద్యార్థుల పాలిట శాపం గా మారుతోందని బిజెపి శాసనమండలి పక్ష నాయకుడు పివిఎన్ మాధవ్ మండిపడ్డారు. నవంబర్ 2 వతే దీనుండి ఇప్పటి వరకు ఎపసెట్ కౌన్సిలింగ్ నిర్వహణ విషయం లోసాంకేతిక విద్యా మండలి పలు మార్లు వాయిదా వేయడంతో అసలు ఎంసెట్ నిర్వహణ జరుగుతుందా లేదా అనే అనుమానాలు విద్యార్థుల తల్లిదండ్రులకు కలుగుతోందని మాధవ్ వివరించారు.ప్రభుత్వం వెంటనే ఎపసెట్ కౌన్సిలింగ్ విషయంలో కూడా స్పష్టత ఇవ్వాలి లేదంటే ఇంజనీరింగ్ ,ఫార్మశీ విద్యార్థుల భవిష్యత్ అంధకారమయ్యే పరిస్థితిలు ఏర్పడతాయని ఎమ్మెల్సీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కు సంబంధించి తొలివిడత కౌన్సిలింగ్ నిర్వహించి సీట్ ఎలాట్మెంట్ ఇవ్వకుండా ఇంత గందరగోళంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్ల ఇంటర్మడీయట్ విద్య నుండి ఉన్నత విద్య వరకు అంతా ఆయోమయం నెలకొంది. అంతే కాకుండా విద్యార్థులు

## సీట్ ఎలాట్మెంట్ వెంటనే పూర్తి చేయాలి

## బీజెపి ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ డిమాండ్

ఇతర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకోసం ప్రయత్నాలు చేయడంతో ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలల పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉంది అయితే ఈ పరిస్థితి ఈ విధంగా కొనసాగుతుంటే రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలదొడ్డిదారిన డొనేషన్ల వసూలు చేసి పేమెంట్ సీట్లుకు అనధికార హామీలు ఇస్తున్నారు ఇది ఇంకా ప్రమాద కార దోరిణి గా భావించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని మాధవ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కౌన్సిలింగ్ ఆన్ లైన్ నిర్వహిస్తామన్న ప్రభుత్వం ఈ విధంగా చోద్యం చూడటం ఏమిటని మాధవ్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రిజల్టు వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తోందని మాధవ్ విడుదల చేసిన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానం వల్ల మెరిట్ విద్యార్థుల తలరాత మారి పోయే పరిస్తితిలు కూడా ఏర్పడతాయి . రాష్ట్రంలోని వందల ఇంజనీరింగ్ కళాశాలలు ఫార్మా కళాశాలల యాజమాన్యాలు కూడా కళాశాలల నిర్వహణ అయోమయ పరిస్తితులు ఏర్పడతాయని మాధవ్ ఆ ఆప్రకటనలో పేర్కొన్నారు.

# నాని కలర్స్ మారుస్తారా



విజయవాడ, నవంబర్ 13, (న్యూస్ పల్స్)విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని మనసు మార్చుకున్నారా? ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారా? అంటే అవుననే అంటున్నారు. టీడీపీలో తిరిగి కేశినేని నాని యాక్టివ్ కావడంతో పార్టీలో ఆయన ప్రత్యర్థులు డైలమాలో పడిపోయారు. కేశినేని నాని పార్టీలోని తన శత్రువులపై సరైన బాణమే వేశారంటున్నారు. తిరిగి పార్టీలో తన హవాను కొనసాగేలా ఆయన పావులు కదుపుతున్నారు.కేశినేని నానికి మొన్నటి వరకూ పార్టీలో తిరుగులేదు. కార్పొరేషన్ ఎన్నికలు ఆయన ప్రతిష్టను మసకబార్చాయి. సొమ్ముపోయినా సుఖం దక్కలేదన్న సామెత ఆయనకు అక్షరాలా వర్తిస్తుంది. కొట్లాడి మరీ తన కుమార్తెను మేయర్ అభ్యర్థిగా ప్రకటింప చేసుకున్నారు. కానీ ఫలితం దక్కలేదు. నాని కూతురు కార్పొరేటర్ గానే మిగిలిపోయారు. పైగా టీడీపీ నేతలు తనకు వ్యతిరేకంగా పని చేయడాన్ని కేశినేని నాని జీర్ణించుకోలేకపోతున్నారు.కేశినేని నాని పై కార్పొరేషన్ ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బోండా ఉమ, నాగుల్ మీరాలు పెద్దయెత్తున విమర్శలు చేశారు. కానీ వారిపై చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి మనస్తాపం చెందిన కేశినేని నాని వచ్చే ఎన్నికలలో తాను పోటీ చేయబోనని చంద్రబాబుకు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత కేశినేని భవన్ లో బాబు ఫొటోల తొలగింపు కూడా వివాదమయింది. అయితే వీటన్నింటిని పక్కన పెట్టి కేశినేని నాని చంద్రబాబు దీక్షలో పాల్గొన్నారు. అధికార వైసీపీని చడా మడా తిట్టేశారు. ఆ తర్వాత జరిగిన కీలక నేతల సమావేశంలోనూ పాల్గొన్నారు.చంద్రబాబు ఢిల్లీ పర్యటనలోనూ కేశినేని నాని కీలకంగా మారారు. ఢిల్లీ పర్యటన అంతా కేశినేని నాని చంద్రబాబు వెంటే ఉన్నారు. దీంతో ఆయనకు చంద్రబాబు మళ్లీ ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష?టమయింది. ఇక కేశినేని నాని దూకుడు చూసి పార్టీలోని ప్రత్యర్థులు డైలమాలో పడ్డారు. బుద్దా వెంకన్న, బొండా ఉమలు సమాలోచనలు జరిపారు. కేశినేనికి ప్రాధాన్యత ఇవ్వడంపై వారు ఆగ్రహంతో ఉన్నారు. త్వరలో బెజవాడ టీడీపీలో కీలక పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయి.

# గంజాయిపై ఉక్కుపాదం

విశాఖపట్నం నవంబర్ 13, (న్యూస్ పల్స్)ఆంధ్ర ఒడిశా సరిహద్దు ఏవోబీలో దశా బ్దాలుగా కొనసాగుతున్న గంజాయి సా గుపై రాష్ట్ర ప్రభుత్వం ఉ క్కుపాదం మో పుతోంది.ఏవోబీలో యథేచ్ఛగా నడు స్తున్న గంజాయి సాగును నామరూపా ల్లేకుండా తుదముట్టించేందుకు ప్రత్యేక బృందాలను యాక్షన్లోకి దించింది.ఏ జన్సీ మారుమూల ప్రాంతాల్లో గంజా యి దందాను కట్టడి చేసేందుకు పోలీ సు శాఖ ఆపరేషన్ పరివర్తన్ ను చేప ట్టింది.గంజాయి దుష్పరిణామాలపై గి రిజనులకు అవగాహన కల్పిస్తూ.. టె క్నాలజీ సాయం, భారీ స్థాయిలో బల గాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు నిర్వహి స్తోంది. రంగంలోకి దిగిన బృందాలు సరిహద్దు ప్రాంతాల్లో రోజులుగా భారీ గా గంజాయి సాగును ధ్వంసం చేస్తు న్నాయి.అటవీ, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో ఎస్ ఈబీ గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపుతోంది.

# ఓటుకు నగదు పంపిణీ

## టీడీపీ ఆరోపణ

కళ్యాణదుర్గం నవంబర్ 13, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో శెట్టురు మండలం కైరేవు గ్రామంలో పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసీపీ నేతలు దౌర్జన్యానికి దిగుతున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. శెట్టూరు మండలం వైసిపి ఎంపీపీ, మండల కన్వీనర్, సోమనాథ్ రెడ్డి వాలెంటర్ కలిసి ఓటుకు1000 డబ్బులు పంచుతున్న వైనం వీడియో వైరల్ లయింది. టిడిపి అభ్యర్థి తలారి తిమ్మరాజు అడ్డుకున్నందుకు వైసీపీ నేతలు బెదిరిస్తున్నారు. ఎసకై, సీఐ, డీఎస్పీలు వచ్చి వేరే పంచాయితీ వారు ఇక్కడ ఉండకూడదు మాన నాయకులని మాన బంధువులను అందరినీ కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారని వారు ఆరోపించారు. ఈ రూల్స్ టీడీపీ వాళ్లకి మాత్రమే వర్తిస్తుంది. అధికార పార్టీ వైసీపీకి వర్తించదా? డబ్బు, మద్యం, వాలంటరీ వ్యవస్థ నీ అడ్డుపెట్టుకొని ప్రజలను మభ్యపెడుతున్నారు. అధికారం ఉంది అండతో ప్రజలారా ఇప్పటికైనా గ్రహించండని టిడిపి నేతలు అంటున్నారు.

# పొత్తులకు సిద్ధమౌతున్న కాంగ్రెస్



విజయవాడ, నవంబర్ 13, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ పొత్తులకు సిద్ధమవుతుంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో కలసి ప్రయాణించాలని భావిస్తుంది. చంద్రబాబు బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారు. అది బెడిసి కొడితే తాము టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని భావిస్తుంది. అందుకే ప్రతి ఉప ఎన్నికల్లోనూ పోటీ చేసి తమ ఓటు బ్యాంకును చెప్పే ప్రయత్నం చేసిందంటున్నారు. బీజేపీతో పొత్తు చంద్రబాబుకు కుదరకపోతే తాము కలసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నామని సంకేతాలను పంపుతుంది.తిరుపతి ఉప ఎన్నిక, బద్వేలు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అందుకే ధీటైన అభ్యర్థులను పోటీ చేయించింది. తిరుపతిలో మాజీ ఎంపీ చింతామోహన్, బద్వేలులో మాజీ ఎమ్మెల్యే కమలమ్మను బరిలోకి దింపింది. అయితే ఓట్ల శాతం పెద్దగా లేకున్నా ప్రభావం చూపే స్థాయిలో తాము ఉన్నామని కాంగ్రెస్ చెబుతోంది. తమతో టీడీపీ కలిస్తే దళిత, మైనారిటీ ఓట్లతో పాటు రెడ్డి సామాజికవర్గం ఓట్లు కూడా వచ్చే అవకాశముందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ లో ఉనికి కోల్పోయింది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు దాదాపు జీరో అయిందనే చెప్పాలి. ఆ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీ వైపు మరలింది. అయితే గత రెండు ఎన్నికల్లో శాసనసభలో ప్రాతినిధ్యం లేకుండా పోవడంతో ఈసారి పొత్తులతోనే వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకు పార్టీ కేంద్ర నాయకత్వం కూడా కసరత్తులు ప్రారంభించింది. పీసీసీ చీఫ్ ను మార్చి రెడ్డి సామాజికవర్గం నేతకు అప్పగించాలని భావిస్తుంది.రెడ్డి సామాజికవర్గ ఓటర్లను ఆకట్టుకునేందుకు ఈ ప్రయోగాన్ని చేయాలని నిర్ణయించింది. దీంతో చంద్రబాబు నిర్ణయంపైనే కాంగ్రెస్ భవిష్యత్ ఆధారపడి ఉంది. కాంగ్రెస్ ఒంటరిగా 175 నియోజకవర్గాల్లో పోట ?చేసే శక్తి, సామర్థ్యం లేకపోవడంతో చంద్రబాబుపైనే ఆశలు పెట్టుకుంది. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నా, సైకిల్ పార్టీ పొత్తు అవసరమని భావిస్తుంది. అందుకే ఇటీవల టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై జరిగిన దాడులను ఖండించడమే కాకుండా, పార్టీ నేతలు కార్యాలయాన్ని సందర్శించారు.

# డిసెంబర్ 9,10 డివైఎఫ్ఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కడప నవంబర్13 భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా 7వ మహాసభలు డిసెంబర్ 9,10 న కడప నగరంలో జరుగుతున్నాయని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ తెలిపారు.స్థానిక జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం నిరుద్యోగ యువతి,యువకులక్ సమస్యల పై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ వస్తుందని అన్నారు.ఈ జిల్లా లో కూడా నిరుద్యోగుల హక్కులకై అనేక పోరాటాలు సాగించామని అన్నారు.రేపు డిసెంబర్ లో కడప నగరం వేదికగా జరిగే జిల్లా మహాసభలలో జిల్లా సమగ్రాభివృద్ధి పై,సమస్యల పై చర్చిస్తామని అన్నారు.జిల్లా మహాసభలకు జాతీయ,రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.ముఖ్యంగా విభజన హామీలలో ప్రధానమైనది కడప ఉక్కు పరిశ్రమ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నెలకొల్పాలని,అపార ఖనిజ సంపద కలిగిన కడప జిల్లా లో ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు.స్థానిక పరిశ్రమలలో సిమెంట్,సోలార్ పరిశ్రమలలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పాతది రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని అన్నారు.వీటన్ని డిమాండ్లతో రేపు జిల్లా మహాసభలలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.జిల్లా నలుమూలల నుండి డివైఎఫ్ఐ నాయకత్వం హాజరవుతారని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముడియం.చిన్ని,నగర కార్యదర్శి షాకీర్ పాల్గొన్నారు.

# ఉనికి కోసమే టీడీపీ పాదయాత్ర

## ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు నవంబర్ 13, (న్యూస్ పల్స్)స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు మీడియా సమావేశంలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ చేయిస్తున్న పాద యాత్రకు న్యాయస్థానం టూ దేవస్థానం అని పేరుపెట్టారు. ఈ యాత్రకు అన్యాయం టూ అన్యాయం అనో దౌరజన్యం. టూ దౌర్జన్యం అనో... మోసం టూ మోసం అనో పేరు పెడితే బాగుండేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాదయాత్రకు నిర్మాత, దర్శకుడు, స్క్రీన్ప్లే అన్నీ చంద్రబాబే అని, అమరావతిలో భూములకు బినామీ చంద్రబాబే. ఈ ఉద్యమానికి బినామీ కూడా చంద్రబాబే అని వ్యాఖ్యానించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కడ చూసినా ఈ టీడీపీ యాత్ర ఉందని, టీడీపీ నాయకులు, శ్రేణులు. కానీ ఈ యాత్ర చేయిస్తున్నది నేను అని చెప్పుకునే ధైర్యం కూడా చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. తన బ్లాక్ మనీని వైట్ చేసుకునేందుకు చంద్రబాబు పడుతున్న తిప్పలు అందరూ చూస్తున్నారని, ఒక అన్యాయం నుంచి మరిన్ని అన్యాయాలకు దారి తీయాలని చంద్రబాబు చేసే ప్రయత్నాలకు మారు పేరుగా ఈ యాత్ర చరిత్రలో నిలిచిపోతుంది. మిగతా జిల్లాలు, మిగతా ప్రాంతాలు, మిగతా సామాజిక వర్గాల వారిని కవ్విస్తూ యాత్ర సాగిస్తున్నారు. తాను అయిదేళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి కనీసం ఒక పర్మెనెంట్ బిల్డింగ్ కట్టానని చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న చంద్రబాబు, తానెందుకు కట్టలేదో మాత్రం చెప్పటం లేదు. చివరికి రైతుల భూముల్లో తాను రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, కరెంటు... వీటిలో ఏ ఒక్కటీ సదుపాయం కల్పించకుండా తనకు కావాల్సిన సంస్థలకు కావాల్సిన రేటుకు అక్కడ భూములు అమ్మేశాడు. ఎందుకంటే తన రియల్ ఎస్టేట్కు బాగా రేటు రావాలని, భూములు ఇచ్చిన రైతులకు డెవలప్డ్ ప్లాట్లు కూడా ఇవ్వకుండా వంచించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్ కో ఆపరేటివ్ స్టోర్ చైర్మన్ షబ్బీర్ ఆహ్మద్, , పెట శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్ యిసాక్ , సోషల్ మీడియాటీం తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం

రాజమండ్రి నవంబర్ 13, (న్యూస్ పల్స్)బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో కుండపోత వానలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు ప్రమాదక స్థితికి చేరాయి. అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో భారీ వర్షాల కారణంగా రోడ్లపై వరద నీరు ఏరులై పారుతోంది.గూడ్స్ గేట్ శ్యామల సెంటర్ కోటిపల్లి బస్టాండ్,విజయ టాకీస్ ఆర్య పురం దేవి చౌక్,కంబాలచెరువు మెయిన్ సెంటర్ లు,ప్రధాన నగరాలు,నగరంలో ఉన్న రహదారులపై వరద నీరు రావడంతో రోడ్డు మీదకు చేరుకున్న చెత్తాచెదారం వచ్చి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తోంది.వర్షాకాల సమయంలో పునరావృతమవుతున్న సమస్యపై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఏపీ మంత్రివర్గం పై తెలంగాణ మంత్రుల వ్యాఖ్యలు సరికావు

కర్నూలు శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, వారి మంత్రి వర్గం కాని అంధ్ర రాష్ట్రం మీద అవాక్కులు చవాక్కులు మాట్లాడటం కేసిఆర్ కు మంచి పద్దతి కాదని అన్నారు. చంద్రబాబు నాయుడుకు ముని శాపం ఉంది. నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలవుతుందని గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చెప్పారు. చంద్రబాబు నాయుడు అదికారంలో ఉంటే ఒకలా మాట్లాడితాడు అదికారంలో లేకుంటే ఇంకోలా మాట్లాడుతాడు. కుప్పం నియోజకవర్గంలో వైఎస్ఆర్ జగన్ మోహన్ రెడ్డి విజయం సాధిస్తారు. మంత్రి శ్రీశైలం శ్రీ భ్రమరాంభా సమేత మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

# అనుమానాస్పదస్థితిలో వృద్ధ దంపతుల మృతి

ఏలూరు నవంబర్ 13, (న్యూస్ పల్స్ అనుమానాస్పదస్థితిలో వృద్ధ దంపతులు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావుపేటకు చెందిన ముత్తా కృష్ణమూర్తి (76), అతని భార్య సూర్యకుమారి (66), వారి తల్లి అన్నపూర్ణ (98) నివాసముంటున్నారు. అయితే కృష్ణమూర్తికి ఇద్దరు కుమార్తెలు, వారికి వివాహాలు అయ్యి వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అయితే కృష్ణమూర్తి, అతని భార్యకు వృద్ధాప్యం రావడంతో అనారోగ్యాలకు గురయ్యారు. వీరిని చూసే వారు లేక వీరికి తోడు కృష్ణమూర్తి తల్లి అన్నపూర్ణ(98) కూడా వీరితోనే ఉంటోంది. అయితే ఆమెకు కూడా పరిచర్యలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయం అనేక పర్యాయాలు తమ తల్లిదండ్రులు చెప్పారని కృష్ణమూర్తి కుమార్తెలు, అల్లుళ్లు పోలీసులకు తెలిపారు. కుమార్తెల వద్దకు వెళ్లడానికి ఇష్ట లేక తాడేపల్లిగూడెంలో ఉంటున్నారని పట్టణ సిఐ ఆకుల రఘు తెలిపారు. మృతుడు కృష్ణమూర్తి మెడకు పెద్ద ఇటుక కట్టుకుని నీటికుండీలో పడి ఉండగా, అతని భార్య సూర్యకుమారి ఇంటిలో మెడకు తాడుకట్టుకుని ఉరేసుకుని మృతి చెంది ఉంది. అయితే కృష్ణమూర్తి తల్లి అన్నపూర్ణ(98) ఇంటిలో మంచంపై పడి ఉంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టణ సిఐ రఘు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద స్థితి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## ఎమ్మెల్యే కోటం రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరికలు

నెల్లూరు నవంబర్ 13, (న్యూస్ పల్స్)నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 31వ డివిజన్, టైలర్స్ కాలానికి చెందిన షేక్ రెహ్మత్, సాజిద్, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఫాజిల్, షేక్ రసూల్, షేక్ మున్వర్ మరియు వారి మిత్రబృందం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 31వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తల మంజుల గెలుపు కోసం పనిచేస్తానన్న షేక్ రెహ్మత్, సాజిద్, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఫాజిల్, షేక్ రసూల్, షేక్ మున్వర్ మరియు వారి మిత్రబృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ యేసు నాయుడు, నెల్లూరు రూరల్ మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ మీరా మొహిద్దీన్, రాష్ట్ర మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సలీం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్ కౌంటర్

దంతేవాడ నవంబర్ 13, (న్యూస్ పల్స్)మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. గడ్చిరోలి జిల్లా ధనోరా తాలూక గ్యారబట్టి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఛాన్స్ ఉన్నట్లు సమాచారం అందుతోంది. కోర్చి పీయస్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. కోర్చి పీయస్ పరిధి లో మావోయిస్టులు ఉన్నట్లు పక్క సమాచారం రావడంతో గడ్చిరోలి జిల్లా పోలీసులు, వారిపై దాడులు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు చోటు చేసుకున్నాయి. ఏడుగురు మావో యిస్టులు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసుల కు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదు. మృతుల సంఖ్య, పోలీసులకు గాయాలపై పోలీసు అధికారులు ఎలాంటి సమాచరం ఇవ్వలేదు.

## నంద్యాల పట్టణ బలిజ సంఘీయుల ఆధ్వర్యంలో పదవులు పొందిన బలిజ సంఘీయులకు సన్మానాలు

నంద్యాల నవంబర్ 13, ( విభారె) :- నంద్యాల పట్టణంలో ఆదివారం అనగా 14.11.2021 ఉదయం 10.00 గం.లకు స్థానిక ఎన్నికల్లో గెలిచిన మరియు నామినేటెడ్ పదవులు పొందిన బలిజ సంఘీయులకు సన్మానం చేయుటకు ఏర్పాటు చేయడమైనదని కార్యవర్గ సభ్యులు తెలిపారు. సన్మాన వేదిక: మహానందీశ్వర స్వామి దేవస్థానం, నంద్యాల యందు ఏర్పాటు చేసామని తెలిపారు. .సన్మాన గ్రహీతలు తప్ప కుండా ఉదయం 10 గంటల లోపు రావలచినదిగా కోరుతున్నాను. సన్మామన గ్రహీతలు 16 వ వార్డు కౌన్సిలర్ వాసగిరి విజయ భాస్కర్. ,38వ వార్డు తూర్పునాటి సావిత్రమ్మ ,09 వ వార్డు దండె నాగమ్మ ,30 వ వార్డు లక్ష్మీ దేవి, 23వ వార్డు బి.రాజ్యలక్ష్మి , కానాల 2 యమ్పిటీసీ రంగారావు . రాయమాల్పురం



సర్పంచ్ పసుపులేటి పార్వతమ్మ , కోఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం , వై.ఎస్.ఆర్.సి.పి లీగల్ సెల్ నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు రామసుబ్బయ్య , ఇటీవలే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైన ఏవి ఆర్ ప్రసాద్ . ఐ.ఎమ్.ఏ పట్టణ ప్రధాన కార్యదర్శి డా.జి. చంద్రశేఖర్ , మహానందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చెంచుగారి వేణుగోపాల్ , వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ దండె వెంకట సుబ్బయ్య , మార్కెట్ యార్డు డైరెక్టర్ దండె బొజ్జయ్య ,మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆమిదెల సుమిత్ర . సంఘీయులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని వారిని అభినందించి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరుతున్నారు. సమావేశ అనంతరం విందు ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.

## శ్రీ కపిలేశ్వర ఆలయంలో చండీయాగం ప్రారంభం

,తిరుపతి (రూరల్ అర్బన్) నవంబర్ 13, ( విభారె) తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీ కామాక్షి అమ్మవారి హోమం(చండీయాగం) శనివారం ప్రారంభమైంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు ఏకాంతంగా హోమ



మహోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా నవంబరు 21వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు చండీయాగం జరుగనుంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉదయం పూజ, నిత్యహోమం, చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం హోమం, చండీపారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ సుబ్రమణ్యం, సూపరింటెండెంట్ శ్రీ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రెడ్డి శేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయంలో వసూళ్ల ఆర్ ఐ, వీఆర్వోలు ,సామాన్యులను జలగల్లా పీక్కుతింటున్న వైనం ,ఫైల్ కదలాలంటే... చేయి తడపాల్సిందే నా...?




నందవరం నవంబర్ 13, ( విభారె) మండల కేంద్రము లో ప్రభుత్వాలు హెచ్చరిస్తున్న అవినీతి శాఖ దాడులు జరుగుతున్న అవినీతి అధికారులు ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొందరు ఉద్యోగులు తమ చేతి వాటాన్ని మార్చుకోలేక పోతున్నారు సులభంగా సంపాదించాలని అత్యాశతో రకరకాల అక్రమ మార్గాలతో ప్రజలను ముప్పుతిప్పలు పెడుతు తమ అవినీతి సామ్రాజ్యాన్ని నలువైపులా విస్తరించుకున్నారు ఎప్పటికప్పుడు ఏసీబీ అధికారులు పలు మండలాల్లో దాడులు నిర్వహించి పలువురు అక్రమార్కులను పట్టుకున్న అవినీతికి అలవాటు పడ్డ కొందరు ఉద్యోగులు లో ఏ మాత్రం మార్పు రావడం లేదు ఫలితంగా సామాన్య ప్రజలకు కష్టాలు తిప్పలు తప్పడం లేదని చెప్పవచ్చు అంతులేని అవినీతి చిట్టా అడుగడుగునా అక్రమార్కులే... కోట్లకు పడగలు ఎత్తున అవినీతి అధికారులు.... రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఉద్యోగులకు చరమగీతం పలికేందుకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసింది ఏ శాఖలో అవినీతి పేరుకుపోయింది అలాంటి శాఖల జాబితాను కూడా ముందస్తుగా హెచ్చరికలు కూడా జారీ చేసింది ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా పని చేయాలని ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయరాదని స్పష్టంగా పేర్కొన్నారు. అంతే కాక ఎవరైనా అవినీతికి పాల్పడిన ఏసీబీకి సమాచారం ఇవ్వాలని బహిరంగంగానే ఇటు ప్రభుత్వం అటు ఏసీబీ అధికారులు ప్రకటనల ద్వారా పేర్కొంటున్నారు అయినప్పటికీ ప్రతి నిత్యం ముసుగులో అవినీతి సంపాదనతో అక్రమార్జనకు అలవాటుపడ్డ కొందరు అధికారులు చాకచక్యంగా ప్రజల నుండి డబ్బులు వసూలు చేసుకుంటున్నారు నందవరం మండలం

### వసూల్ విఆర్ఓ ఆర్ ఐ లపై ఏసీబీ నిఘా ఏది..?

రెవెన్యూ కార్యాలయంలో వసూళ్ళ ఆర్ ఐ విఆర్ఓ లపై ఏసీబీ నిఘా........? లేకపోవడంతో ఇలాంటి వీఆర్వోలు అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించే అవకాశం లేకపో లేదు అంటున్నారు ప్రజలు.ఆలాంటి అవినీతి అధికారులు రెవెన్యూ కార్యాలయంలో ఆర్ ఐ, విఆర్వోలు ఉన్నారు వీరిద్దరికీ రైతులు సామాన్య ప్రజలు కలిసి రా అని నామకరణం కూడా చేసినట్లు సమాచారం నందవరం రెవెన్యూ కార్యాలయంలో ఆ ఇద్దరి అవినీతి తారా స్థాయికి చేరిందని చర్చ జోరుగా సాగుతోంది ఫైనలు ఇవ్వనిదే ఫైల్ కదలడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అవినీతి కార్యక్రమాలకు రెవెన్యూ కార్యాలయాన్ని అడ్డాగా చేసుకుని ఇద్దరు వసూళ్లకు పాల్పడుతున్నారు అని విమర్శలు ఉన్నాయి రెవెన్యూ రికార్డులో ఒకరి భూమిని మరొకరి పేరు మార్చడం రికార్డులను ట్యాంపరింగ్ చేసి ఒకరి భూమిని మరొకరి పేరిట రాయడం రికార్డులో ఉన్న పేర్లను కంప్యూటర్లో నమోదు చేయకపోవడం ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ పట్టా పాసుపుస్తకాల కోసం వచ్చిన వారిని తమ చుట్టూ తిప్పుకోవడం పరిపాటిగా మారిందని ఈ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు. అ ఇద్దరు అధికారుల అక్రమాల వాసులపై మండలంలో ఆసక్తికర చర్చ ఆసక్తికర చర్చలు వినిపిస్తునాయి.ఆ ఇద్దరు అధికారుల నుంచి ఇన్నాళ్లు తాము ఎదుర్కొన్న ఇబ్బందులు బాధితులు నెమరేసుకున్నారు రెవెన్యూ రికార్డుల్లో ఒకరి పేరు తొలగించి మరొకరి పేరు రాయడం రికార్డుల్లో ఉన్న పేర్లను కంప్యూటర్లో నమోదు చేయకపోవడం ఇలా కొన్ని ఫైళ్లు పెండింగ్లో ఉంచి తమ చుట్టూ తిప్పుకోవడం పట్టా పాస్బుక్కులు ఇవ్వకపోవడం ఇలా ప్రతి పనికి రేట్ ఫిక్స్ చేసి ముడుపులు ముడితేనె పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు ఇలా ఆ ఇద్దరు అధికారులు సామాన్య ప్రజల నుండి అందిన కాడికి డబ్బు పొందుతున్నట్లు సమాచారం గత కొన్నేళ్లుగా గ్రామాలలో పాతుకుపోయిన అధికారులు స్థానికంగా ఉండే రాజకీయ నాయకులతో ఉన్న పరిచయాలను తమ సంపాదన గా మార్చుకుంటూ ఉన్నట్లు సమాచారం ప్రభుత్వ అసైన్డ్ భూములు అనే విషయాన్ని మర్చిపోయి కాసులకు కక్కుర్తి పడుతూ ఇష్టానుసారంగా ఇచ్చేచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలాల్లో మండలాల్లో భూముల ధరలు అధికంగా ఉండడంతో రెవెన్యూ కిందిస్థాయి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

## ట్రాన్స్ జెండర్స్ అందరి తో సమానం గౌరవం గా జీవించేందుకు ప్రత్యేక ఉపాధి శిక్షణ

### ఎం పి మద్దిల గురుమూర్తి

,తిరుపతి (రూరల్ అర్బన్) నవంబర్ 13, ( విభారె) తిరుపతి ఎం పి మద్దిల గురుమూర్తి శనివారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్స్ సమస్యలు పై వారి తో సమావేశమయ్యారు. వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్ జెండర్స్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో రేషన్,ఆరోగ్య శ్రీ కార్డ్స్ లేవని ఇప్పుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రేషన్,ఆరోగ్యశ్రీ కార్డ్స్ మంజూరు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక 43 మంది కి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. అలాగే తమకు అందరికి ఒకే చోట జగనన్న కాలనీ ల్లో ఇళ్లను కేటాయించాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. కడప,చిత్తూరులల్లో ట్రాన్స్ జెండర్స్ కె ప్రత్యేకంగా ఇళ్లు ఇచ్చారని, దీని వల్ల ఏదైనా సమస్య పై మాట్లాడుకోవలన్న అందరూ అందుబాటులో ఉంటామన్నారు. ఈ విషయం పై అప్పటికప్పుడే ఎం పి మద్దిల గురుమూర్తి ఈ సమస్య పై అధి కారుల తో మాట్లాడారు. ట్రాన్స్ జెండర్స్ కి ప్రత్యేకంగా ఉపాధి శిక్షణ చేపడతామన్నారు. సమాజంలో అన్నివర్గాల తో సమానంగా గౌరవం గా జీవించేందుకు వీలుగా ఉపాధి శిక్షణ ఏర్పాట్లు చేస్తామన్నారు. “ ట్రాన్స్ జెండర్స్ మాట్లాడుతూ సార్ మీరు దేవుడు లాగా మమ్మల్ని పిలిపించుకుని మా సమస్యలు కనుక్కోవడం చాలా సంతోషంగా ఉంది, దేవుడే మీ రూపంలో మా దగ్గరకు వచ్చినట్లు ఉందన్నారు. ఇల్లాస్థాలు, డ్రైవింగ్ శిక్షణ కు అధికారుల తో మాట్లాడతమన్నారు. భిక్షాటన చేసి బతకాలని మాకు లేదు సార్, డ్రైవింగ్ నేర్పించి, సబ్సిడీ లో కారులు కొనుగోలుకు రుణాలు ఇస్తే అందరి లాగే గౌరవం గా బతుకుతామన్నారు. అలాగే మాకు ప్రత్యేకంగా గుడి కట్టుకుని పూజలు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు.

## సలీం నగర్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

### సీపీఐ నాయకులు బాబ పక్రుదిన్. కె ప్రసాద్ డిమాండ్




నంద్యాల నవంబర్ 13, ( విభారె) :- సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నంద్యాల పట్టణంలో ఉన్న సీపీఐ కార్యాలయం లో కార్యదర్శి భూమని శ్రీనివాసులు అధ్యక్షతనతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశమునకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ నంద్యాల పట్టణాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపల్ సిబ్బంది సలీం నగర్ కాలనీ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. . ముఖ్యంగా రాత్రి అయితే దోమలతో అల్లాడుతున్నారని తెలిపారు. శ్యామ కాలవ దగ్గర రక్షణ గోడ నిర్మిస్తామని కొంతవరకు నిర్మించి వదిలి వేయడం జరిగిందని అన్నారు. వర్షాకాలం వస్తే చామకాలవ పొంగి వరద నీరు సలీం నగర్ లోకి రావడం జరుగుతుందని తెలిపారు. రహదారుల పక్కన ఉన్న డ్రైనేజీ నిండి ఆ నీరు రహదారులలో నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది అక్కడి వారిని ఇబ్బంది పాలు చేస్తున్నాయని అన్నారు. వెంటనే సంబంధించిన అధికారులు మున్సిపల్ అధికారులు స్పందించకపోతే త్వరలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సలీం నగర్ శాఖ సహాయ కార్యదర్శులు సుబ్బరాయుడు అజీస్ భాష సభ్యులు కలాం భాష కరీమ్ఖాన్ శివ మద్దిలేటి అల్తాఫ్ వెంకటేష్ స్వామి సలీం భాయ్ ఖాజా హుస్సేన్ అల్లా ప్రకాష్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో వాలంటీర్

నెల్లూరు నవంబర్ 13, ( విభారె) నెల్లూరు కార్పోరేషన్ ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. 48వ డివిజన్ లో ఓటర్ స్లిప్స్ పంచుతూ వాలెంటీర్ టీడీపీ నేతలకు అడ్డంగా దొరికింది. అధికార పార్టీ నేతల ఒత్తిడితో టిడిపి నేతలపై కేసులు బనాయించి పోలీసుల ప్రయత్నం అని వారు ఆరోపించారు. వాలంటీర్లు స్లిప్పులు పంపిణీ చేయకూడదని కమిషనర్ ఆదేశించినా వాలంటీర్లు .. పట్టించుకోవడంలేదని వారు అన్నారు. పోలీసులు, కార్పొరేషన్ సిబ్బంది వైసీపీ నేతలకు తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

## అలాంటి రోల్ కోసం వెయిట్ చేసున్నాను

తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో సాయిపల్లవికి విపరీతమైన క్రేజ్ ఉంది. సాయిపల్లవి నటనలోని సహజత్వాన్నీ .. ఆమె నటనలోని వైవిధ్యాన్ని ప్రేక్షకులు ఎంతగానో ఇష్టపడతారు. ముఖ్యంగా ఆమె చాలా మంచి డాన్సర్. ఆమెతో డాన్స్ అంటే హీరోలు కాస్త ఎక్కువగా రిహార్సల్స్ చేస్తారు.ఏ భాషలోను స్కిన్ షో చేయకుండా స్టార్ హీరోయిన్ గా కొనసాగుతుండటం ఆమెకి మాత్రమే చెల్లింది. సాధారణంగా హీరోయిన్స్ లో కొంతమంది యూత్ కి నచ్చితే మరికొంతమంది ఫ్యామిలీ ఆడియన్స్ కి నచ్చుతారు. ఈ రెండు వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందడం సాయిపల్లవి ప్రత్యేకత.సాయిపల్లవి నుంచి ఇటీవల వచ్చిన 'లవ్ స్టోరీ' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. డాన్స్ పరంగా ఆమెకి మరిన్ని మార్కులు తెచ్చిపెట్టింది. ఇక త్వరలో ఆమె నుంచి 'విరాటపర్వం' .. 'శ్యామ్ సింగ రాయ్' రానున్నాయి. ఈ రెండు సినిమాలు కూడా విభిన్నమైన జోనర్లకు చెందినవే.నక్సలిజం నేపథ్యంలో 'విరాటపర్వం' నడిస్తే చారిత్రక నేపథ్యంలో 'శ్యామ్ సింగ రాయ్' కొనసాగుతుంది. ఆమె అభిమానులంతా కూడా ఈ సినిమాల కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాలు తనకి మరింత మంచి పేరును తీసుకొస్తాయని సాయిపల్లవి భావిస్తోంది.ఇంతవరకూ సాయిపల్లవి చాలా బరువైన పాత్రలను పోషిస్తూ వచ్చింది. బలమైన ఎమోషన్స్ తో కూడిన పాత్రలను చేస్తూ వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన కథలను ఎక్కువగా ఎంచుకోవడం వలన ఆమె ఆ తరహా పాత్రలను ఎక్కువగా చేయవలసి వచ్చింది.తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ .. హిలేరియస్ కామెడీతో కూడిన కథల్లో .. మంచి కామెడీ టైమింగ్ ఉన్న పాత్రలను చేయాలని ఉందని చెప్పింది. అలాంటి పాత్రల కోసం వెయిట్ చేస్తున్నాననీ ఆ తరహా పాత్రలలో తనని తాను నిరూపించుకోవాలని ఉందని అంది.మరి సాయిపల్లవి కోసం అలాంటి పాత్రలను ఎవరు రెడీ చేస్తారో .. ఎప్పటికి ఆమె నిరీక్షణ ఫలిస్తుందో చూడాలి.నాని సరసన నాయికగా సాయిపల్లవి చేసిన 'శ్యామ్ సింగ రాయ్' డిసెంబర్ 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇక తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో కొన్ని కథలను ఓకే చేశాననీ ఆ ప్రాజెక్టుల విషయంలో త్వరలో క్లారిటీ వస్తుందని సాయిపల్లవి చెప్పింది. కొత్త ఏడాదిలో సాయిపల్లవి ఏ హీరోలతో కలిసి సెట్స్ పైకి వెళుతుందో ఎలాంటి విభిన్నమైన పాత్రలతో సందడి చేస్తుందో చూడాలి.



## ఫ్యాన్స్ ఆవేదన అర్థం చేసుకోండి రాధే శ్యామా..!

టాలీవుడ్ లో ఈ మధ్య స్టార్ హీరోల సినిమాలకు సంబంధించి వరుస అప్డేట్స్ తో సందడి నెలకొంది. డిసెంబర్ లో విడుదలయ్యే సినిమాలను మొదలుకొని.. సంక్రాంతి రేసులో ఉన్న పెద్ద చిత్రాల నుంచి రోజుకో అప్డేట్ వస్తుండటంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చే 'పుష్ప' షూటింగ్ కంప్లీట్ అవనప్పటికీ.. అప్డేట్స్ మాత్రం కొదువ లేకుండా వస్తున్నాయి. జనవరి 7న రిలీజ్ కాబోయే 'ఆర్.ఆర్.ఆర్' మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి.సంక్రాంతికి వస్తుందో లేదో తెలియని 'భీమ్లా నాయక్' కూడా లాలా భీమ్లా అంటూ హంగామా చేస్తున్నాడు. ఫిబ్రవరిలో వచ్చే 'ఆచార్య'.. ఎప్పుడొస్తారో చెప్పని 'అఖండ' 'ఖిలాడి' కూడా అప్డేట్స్ తో హడావిడి చేస్తున్నారు. 'శ్యామ్ సింగ రాయ్' కూడా క్రిస్మస్ కోసం గట్టిగానే ప్రచారం చేసుకుంటున్నాడు. మొన్నమొన్ననే సెట్స్ మీదకు వెళ్లిన 'బంగార్రాజు' కూడా ప్రమోషన్స్ షురూ చేసాడు. సంక్రాంతి రేసులోకి చాలా ఆలస్యంగా వచ్చిన సోగ్గాడు.. ఓవైపు షూటింగ్ మరోవైపు ప్రచారం అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. జనవరిలో రాబోతున్నట్లు ప్రకటించకుండానే 'లడ్డుండా' అంటూ సోషల్ మీడియాలో హవా కొనసాగిస్తున్నారు.అయితే అప్పుడెప్పుడో సంక్రాంతి వార్ లో దిగబోతున్నట్లు ప్రకటించిన 'రాధే శ్యామ్' మాత్రం ప్రచారంలో బాగా వెనుకబడి పోయింది. మూడేళ్ళ క్రితం మొదలైన ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క పాట కూడా బయటకు రాలేదు. మధ్యలో ఫస్ట్ లుక్ - గ్లిమ్స్ - టీజర్ అంటూ అప్పుడప్పుడు పలకరించారు. కాకపోతే ఇప్పుడే రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేశారు.. మిగతా సినిమాలు ప్రమోషన్స్ లో దూసుకుపోతున్నాయి. ఇంతకు ముందు అయితే షూటింగ్ కంప్లీట్ అవలేదని నచ్చజెప్పుకోవచ్చు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు.'రాధే శ్యామ్' అప్డేట్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. రిలీజ్ కు రెండు నెలలే సమయం ఉన్నా కదలిక లేకపోవడంతో చిత్ర నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ మరియు డైరెక్టర్ రాధా కృష్ణ కుమార్ మీద ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. డార్లింగ్ ఫ్యాన్స్ తమ నిరాశను అసంతృప్తిని ఇతర హీరోల ప్రమోషన్ కార్యక్రమాలతో పోల్చుతూ సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో వ్యక్తం చేస్తున్నారు. ఇది ఓ అభిమాని సూసైడ్ నోట్ రాసే వరకు వెళ్ళింది. అయినా మేకర్స్ లో చలనం లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. నవంబర్ 15న 'రాధే శ్యామ్' ఫస్ట్ సింగిల్ ఉంటుందని టాక్ వినిపిస్తోంది. మరి ఈసారైనా అభిమానుల ఆవేదన అర్థం చేసుకొని అప్డేట్ అందిస్తారేమో చూడాలి.

## వరుణ్ తేజ్ సినిమాలో మాధురిగా పవన్ కళ్యాణ్ అత్త..!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న తాజా చిత్రం "గని". బాక్సింగ్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. కిరణ్ కొరపాటి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్.. వరుస అప్డేట్స్ అందిస్తున్నారు గని వరల్డ్ లోని క్యారెక్టర్స్ ను పరిచయం చేస్తూ చిత్ర బృందం రీసెంటుగా ఓ వీడియోని రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో వరుణ్ తేజ్ సరసన హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీ సైఈ మంజ్రేకర్.. నదియా - సీనియర్ నరేష్ - తనికెళ్ళ భరణి - ఉపేంద్ర - సునీల్ శెట్టి - జగపతిబాబు - నవీన్ చంద్ర తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలియజేశారు.తాజాగా 'గని' చిత్రంలో సీనియర్ నటి నదియా లుక్ ని చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆమె ఇందులో మాధురి అనే పాత్ర పోషించిందనే విషయాన్ని వెల్లడించారు. ఈ ఫొటోలో నదియా హుందాగా కన్పిస్తోంది. ఆమె క్యారక్టర్ కు సంబంధించిన ఇతర వివరాలేవే వెల్లడించనప్పటికీ.. నదియా కీలక పాత్రలో కనిపించనుందని అర్థం అవుతోంది.'మిర్చి' సినిమాతో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చిన నదియా.. 'అత్తారింటికి దారేది' 'దృశ్యం' 'బ్రూస్లీ' 'అ ఆ' 'నా పేరు సూర్య' 'మిస్ ఇండియా' 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో అలరించింది. 'దృశ్యం 2' సినిమా విడుదలకు సిద్ధమవ్వగా.. ఖీంఖూ19 షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పుడు 'గని' సినిమా రిలీజ్ కు రెడీ అయింది. బాబాయ్ పవన్ కు అత్తగా మెప్పించిన నదియా.. అబ్బాయ్ వరుణ్ తేజ్ సినిమాలో ఎలాంటి పాత్రలో అలరించబోతుందో చూడాలి.కాగా 'గని' చిత్రంలో వరుణ్ తేజ్ బాక్సర్ గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ - గ్లిమ్స్ - ఫస్ట్ సింగిల్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. నవంబర్ 15న సినిమా టీజర్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.అల్లు అరవింద్ సమర్పణలో రెనైస్సన్స్ పిక్చర్స్ మరియు అల్లు బాబీ కంపెనీ పతాకాలపై ఈ సినిమా రూపొందుతోంది.

## కోహ్లీ.. టాస్ కోసం ఏమైనా టిప్స్ ఇస్తావా: కేన్ విలియమ్సన్




టి20 ప్రపంచకప్ 2021 ఫైనల్ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు వసీం జాఫర్ ఫన్నీ ట్రోల్ చేశాడు. “ ఆసీస్‌తో ఫైనల్ కోసం కోహ్లికి కేన్‌మామకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు. దీనికి విలియమ్సన్ థ్యాంక్స్.. టాస్ కోసం ఏమైనా టిప్స్ ఇస్తావా” అన్నట్లుగా ఫోట్ షేర్ చేయడం వైరల్‌గా మారింది. ఈ ప్రపంచకప్‌లో టాస్ కీలకంగా మారిన సంగతి తెలిసిందే. దాదాపు అన్ని మ్యాచ్‌ల్లోనూ టాస్ గెలిచిన జట్లే ఎక్కువగా విజయాలు నమోదు చేశాయి. అయితే కోహ్లికి మాత్రం టాస్ కలిసి రాలేదు. న్యూజిలాండ్, పాకిస్తాన్‌తో మ్యాచ్‌ల్లో కోహ్లి టాస్ ఓడిపోవడం పెద్ద దెబ్బ. రెండు వరుస ఓటములు మనను సెమీఫైనల్‌కు దూరం చేశాయి. ఆ తర్వాత భారీ విజయాలు సాధించినప్పటికి అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తాజాగా ఫైనల్ మ్యాచ్‌లోనూ టాస్ కీలకంగా మారనుంది.ఇక సెమీ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌ను ఓడించి న్యూజిలాండ్.. పాకిస్తాన్‌ను ఓడించి ఆస్ట్రేలియా ఫైనల్లో అడుగుపెట్టాయి. ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్న ఈ రెండు జట్లలో ఏది గెలిచినా టి20 ప్రపంచకప్‌లో కొత్త విజేతను చూస్తాం. ఈ నేపథ్యంలో వసీం జాఫర్ కివీస్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పాడు. “ ఈ ప్రపంచకప్‌లో టాస్ కీలకంగా మారింది. సాధారణంగా క్యాచెస్ విన్ మ్యాచెస్ అంటారు.. కానీ ఇక్కడ మాత్రం టాస్ విన్ మ్యాచ్స్ లాగా తయారైంది. కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో అటు కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్.. ఇటు ఆసీస్ ఆరోన్ ఫించ్ ఇద్దరు టాస్ గెలిచి సగం మ్యాచ్ గెలిచారు. కానీ ఇది ప్రతీసారి జరగకపోవచ్చు. ఇక ఐసీసీ ఈవెంట్లలో ఫైనల్ చేరిన సందర్భాల్లో ఆస్ట్రేలియా ఫేవరెట్‌గా కనిపిస్తుంది. కానీ న్యూజిలాండ్ తక్కువ అంచనా వేస్తే ఆసీస్‌కు ప్రమాదం. మొత్తానికి మ్యాచ్ మాత్రం రసవత్తరంగా సాగడం ఖాయం అంటూ చెప్పుకొచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**